తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 185 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | మంగళవారం 10 డిసెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-



» ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం
» ఉద్యమం రోజుల్లో 'టీజీ' అని రాసుకున్నామని వెల్లడి
» రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్న రేవంత్ రెడ్డి

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా
# 'టీఎస్'ను 'టీజీ'గా మార్చాం

శాసనసభ / హైదరాబాద్ : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము 'టీఎస్'ను 'టీజీ'గా మార్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈరోజు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎన్నో ఏళ్ళు అవహేళనకు గురైందన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరూ 'టీజీ' అని రాసుకున్నారని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం 'టీఎస్' అని తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు.తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతిచోట 'జయ జయహే తెలంగాణ' వినిపించేదని, కానీ రాష్ట్రం వచ్చాక ఆ గేయానికి గౌరవం దక్కలేదని విమర్శించారు. అందుకే తాము ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించామన్నారు. తెలంగాణ పదేళ్ల పాటు వివక్షకు గురైందన్నారు. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరిలూదారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తాము సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్నారు.

4వ పేజీలో

## ప్రతి ఏడాది డిసెంబర్ 9న
# తెలంగాణ తల్లి ప్రతిష్ఠ ఉత్సవం



4వ పేజీలో

శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని తాము ఏమీ మార్చలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అనేక పార్టీలు అనేక ప్రతిరూపాలతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించాయన్నారు.రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు అధికారికంగా విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని ఆయన వెల్లడించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ప్రతిష్ఠ ఉత్సవం చేసుకుందామంటూ ప్రజలకు తెలిపారు. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలోఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగించారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
### ఈ నెల 16 వరకు వాయిదా



## తెలంగాణ తల్లిని అవమానించినందుకు
# ఈ రెండు చేద్దాం!
## బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

- 2007లో ఉద్భవించిన తెలంగాణ తల్లిని డీపీగా పెట్టుకుందామని పిలుపు
- అలా చేస్తే ఎవరేం చేస్తారో చూస్తామని సవాల్
- తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేయాలని పిలుపు

శాసనసభ / హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని అవమానించిందని, అందుకు గాను రేండు పనులు చేద్దామని బీఆర్ఎస్ కార్యకర్తలకు,తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 2007లో ఉద్భవించిన తెలంగాణ తల్లిని మనం డీపీగా పెట్టుకుంటే ఎవరేం చేస్తారో చూద్దామన్నారు "బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరికీ.

»»4లో



## ఇంకా 'ఉచితాలు' ఇవ్వడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు



- కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులపై దాఖలైన పిటిషన్ మీద విచారణ
- 81 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నట్లు తెలిపిన కేంద్రం
- ఇంకా ఎంతకాలం ఇస్తారంటూ సుప్రీంకోర్టు ప్రశ్న

మిగతా »»4లో

# సోనియా గాంధీ లేకుంటే
## మరో జన్మలోనూ తెలంగాణ వచ్చేది కాదు



»»4లో

## ఇదేనా తెలంగాణ ఆడబిడ్డలకు సోనియా
# గాంధీ బర్త్ డే గిఫ్ట్?

- ఆడబిడ్డలను ఖాకీలతో కొట్టించారని కవిత ఆగ్రహం
- హామీలపై ప్రశ్నించినందుకు ఆశా వర్కర్లపై అమానుషం అంటూ మండిపాటు
- కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం ఖాయమని హెచ్చరిక

మిగతా »»4లో



## అదానీ టీషర్ట్ రాహుల్ వేసుకుంటే మీకు పర్వాలేదు..
# మేము వేసుకుంటే ఇబ్బంది ఏమిటి?



- అసెంబ్లీకి రేవంత్, అదానీ టీషర్టులు వేసుకుని వెళ్లిన బీఆర్ఎస్ నేతలు
- అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ హరీశ్ రావు




శాసనసభ / హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాలకు రేవంత్, అదానీ ఫొటోలు ఉన్న టీషర్టులను వేసుకుని వచ్చిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఆ టీషర్టులను తొలగించాలని వారికి పోలీసులు సూచించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అదానీ టీషర్టులు ధరించి కాంగ్రెస్ నేతలు పార్లమెంటుకు వెళ్లారని... . అదానీ అక్రమాలను నిరసిస్తూ వెళ్లారని చెప్పారు. ఢిల్లీలో మీ నాయకుడు రాహుల్ గాంధీ... అదానీ టీషర్ట్ వేసుకుని వెళ్తే మీకు పర్వాలేదు... ఇక్కడ మేము టీషర్టులు ధరించి వస్తే మీకు ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు.రాహుల్ గాంధీకి ఒక నీతి, రేవంత్ రెడ్డికి మరో నీతి ఉంటుందా? అని హరీశ్ ప్రశ్నించారు. రేవంత్ తో అదానీకి ఉన్న అక్రమ సంబంధాలు బయటపడతాయని అడ్డుకుంటున్నారా? అని అడిగారు. కాంగ్రెస్ పార్టీకి ఒక సిద్ధాంతం అంటూ లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అరాచక పాలన కొనసాగుతోందని మండిపడ్డారు.

## ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థులను
# ప్రకటించిన చంద్రబాబు



- ఏపీలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలు
- టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సాన సతీశ్... బీజేపీ నుంచి కృష్ణయ్యకు చాన్స్
- డిసెంబరు 20న పోలింగ్

4లో

## ఢిల్లీ ఎన్నికలకు ఆప్ రెండో జాబితా
# సిసోడియా సహా వీరికి సీట్లు..!



ఢిల్లీ / శాసనసభ : వచ్చే ఏడాది జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార ఆమ్ ఆద్మీ పార్టీ వేగంగా సన్నాహాలు చేసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసిన ఆప్..ఇవాళ రెండో జాబితా కూడా విడుదల చేసింది. ఇందులో మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా సహా పలువురికి చోటు దక్కింది. ఇవాళ ప్రకటించిన రెండో జాబితాలో మొత్తం 20 మంది అభ్యర్థులకు చోటు దక్కింది.

మిగతా »»4లో

## సిపిఐ బహిరంగ సభ విజయవంతం చేయండి

**- ఉమ్మాపురం గ్రామ శాఖ సమావేశంలో సిపిఐ మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు.**



**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** డిసెంబర్ 30 నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సిపిఐ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరి రావు కోరారు. సోమవారం మండలంలోని హరిజనాపురం గ్రామంలో నిర్వహిం చిన సిపిఐ గ్రామ శాఖ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన మాట్లాడుతూ 26 డిసెంబర్ 1925న ఏర్పడిన సిపిఐ నాటి నుండి నేటి వరకు పేద ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. నల్లగొండలో డిసెంబర్ 30న సిపిఐ 100సంవత్సరాల విజయోత్సవ సంబరాల్లో భాగంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నందున పార్టీ కార్య కర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని త్వరగా అర్హు లందరికి నూతన రేషన్ కా ర్డులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, అంజాలరావు, శేఖరా చారి, ఇద్దయ్య, లక్ష్మయ్య,బుచ్చయ్య, నరసింహ, వెంకటయ్య శాఖ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానోత్సవం



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నం నందు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో పాల్గొని బహుమతులు పొందిన విద్యార్థులకు సోమవారం నాడు పాఠశాలలో వారు పొందిన సర్టిఫికెట్లను ప్రధానోత్సవం చేయడం జరిగింది. అదేవిధంగా వారి యొక్క తల్లిదండ్రులను కూడా సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈకార్యక్రమంలో కరాటె గ్రాండ్ మాస్టర్ మంకాల అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, శ్రీలత ,నీలిమ, రోజ, లలిత పాల్గొన్నారు.

## వికలాంగులకు ఇందిరమ్మ ఇండ్లు 5 శాతం కేటాయించాలి

**విహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు డేరంగుల ఈశ్వర్**



**యాచారం శాసన సభ న్యూస్ ( డిసెంబర్ 09):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు జీవో ప్రకారం 5 శాతం వికలాంగులకు ఇవ్వాలని వి హెచ్ పి ఎస్ మండల అధ్యక్షుడు డేరంగుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులను గుర్తించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామపంచాయతీ సెక్రటరీ వికలాంగుల కు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.

## మంత్రి మల్లు భట్టి విక్రమార్క నందినిని కలిసిన కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి





**కొండమల్లేపల్లి,శాసనసభ న్యూస్ డిసెంబర్ 9 :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క నందిని నివాసంలో సోమవారం నాడు వారిని కలిసి తమ ఇంట్లో జరగబోయే శుభ మహోత్సవ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరబారని ఆహ్వాన పత్రిక అందచేసిన కొండమల్లేపల్లి మండల మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి దంపతులు.

## సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి - ఇడం కైలాసం



**చండూర్ డిసెంబర్ 9 శాసనసభ న్యూస్) :** తాజా మాజీ సర్పంచ్ లు తమ పదవి కాలం లో చేసిన పనులకు బిల్లులను వెంటనే చెల్లించాలని దినీపై అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సోమవారం రోజు అసెంబ్లీ వద్ద నిరసన తెలుపుతున్న ఇడం కైలాసం ని అసెంబ్లీ ముందు సైఫాబాద్ పోలీస్ లు అరెస్టు చేసి బేగం బజార్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భముగా కైలాసం మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచ్ లు పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలలో పనులను నిర్వహించిందని, కానీ పదవి కాలం ముగిసిన నేటికీ బిల్లులు రాకపోవడం తో ఇబ్బంది పడుతున్నామని, ఈ సందర్భముగా కైలాసం అన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు అభిషేక్ రెడ్డికి , డైరెక్టర్లకు సన్మానం





**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 09):** కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు యాచారం కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం లో మండల అధ్యక్షుడు మస్కు నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం అనంతరం... ఎమ్మెల్యే తనయుడు మల్ రెడ్డి, అభిషేక్ రెడ్డి తో కేక్ కట్ చేశారు. ఆయనకు శాలువాతో సన్మానించారు. ఆమె ఆయువు ఆరోగ్యాలతో బాగుండాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షులు మంకాల దాసు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గులాం అక్బర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొలమోని రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పాశం జయప్రకాష్, మండలం సేవాద అధ్యక్షులు పూజారి రాకేష్ కుమార్, మాజీ వైస్ ఎంపీ పీ రామ్ రెడ్డి, లిక్కి పాండు రంగారెడ్డి, గొల్లపల్లి భాస్కర్ గౌడ్, గుండ్లపల్లి మురళి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యపై నిరంతరం దృష్టి సారించాలి

### విద్యార్థులు సత్ప్రవర్తతో కలిగి ఉండాలి

### పౌష్టికాహారం అందించాలి : సీఐ కృష్ణంరాజు





**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 09) :** విద్యార్థులు విద్యపై నిరంతరం దృష్టి సారించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మసీటి సిఐ కృష్ణంరాజు అన్నారు.సోమవారం మండల పరిధిలో మేడిపల్లి లో ప్రభుత్వ పాఠశాలను అకస్మాత్తుగా సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే పునాది రాయిగా మలుచుకోవాలని సూచించారు. విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు కలిసి భోజనం చేశారు. పౌష్టిక ఆహారం పంపించాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐ తేజం రెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష ఉద్యోగుల దీక్షకు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు





**చింతపల్లి, శంషాబాద్ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** చింతపల్లి మండలంలో సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనిమండల విద్యావనరుల కార్యాలయం ముందు శాంతియుత రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి నాలుగవ రోజుకు చేరింది. ఈ నిరాహార దీక్షకు సోమవారం పిఆర్టియు,టీఎస్ యుటిఎఫ్, టిపియూఎస్ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు చేపట్టిన నిరసన కార్య క్రమానికి ఉద్యోగులు, ప్రజల నుంచి మద్దతు తెలిపాలని కోరారు.మద్దతు తెలిపిన వారిలో పిఆర్టియు మండల అధ్యక్షులు పాల్వాయి వాసుదేవ రెడ్డి,టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు నారాయణ, తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల చారి,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వెంకన్న,సమగ్ర శిక్ష సంఘ సభ్యులు మండల అధ్యక్షురాలు వాసవి, హెూలీ సుధీర్ కుమార్,జనరల్ సెక్రెటరీ ఆర్ లక్ష్మి,నారాయణరెడ్డి గౌరవాధ్యక్షులు జగ్రామ్ ,జిల్లా అసోసియేట్ మేంబర్, దుపాటి రమేష్ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం,రాష్ట్ర అసోసియేట్ సభ్యులు బసవరాజ్ శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి,జనరల్ సెక్రెటరీ ఆనంద్ బాబు,ఉపాధ్యక్షులు వెంకటేశం, మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సమగ్ర శిక్ష అధ్యక్షులు. వాసవి, ట్రెజరర్ సైదులు,సీఆర్ పిలు లక్ష్మి, ఐ ఈ ఆర్ పి వరదా చార్యులు, ఎల్ ఎన్ రావు,సీసీ ఓ షఫీయుదిన్,ఎం ఐ ఎస్ నరేష్ పి టి ఐ లలిత కల్యాణి రుద్రమదేవి,అనురాధ,అనూష సుకన్య,స్వాతి, చంద్రకళ, కలమ్మలు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ డిసెంబర్ 9 :** కొండమల్లేపల్లి మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించిన టీపీసీసీ సభ్యులు పిఎసి ఎస్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి. కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊట్కూరు వేమన్ రెడ్డి టీపీసీసీ సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి ,మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ స్వప్నాన్ని సహకారం చేసి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసినారు. సోనియాగాంధీ ఆనాడు భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మరణం తర్వాత చిన్న పిల్లలను వేసుకొని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ దేశానికి సేవ చేసిన సుస్థిర భారత నిర్మాణానికి పాటుపడుతూ, 60ఏళ్ల నుంచి తెలంగాణ ఉద్యమం నడుస్తుంది అనేకమంది బలిదానాలు అది చూసి భరించలేక పార్లమెంట్లో తెలంగాణ బిల్లును పాస్ చేసి నాలుగు కోట్ల తెలంగాణ బిడ్డల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా వారికి ప్రత్యేకమైన శుభాకాంక్షలు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊట్కూరు వేమన్ రెడ్డి గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కైసర్ ఖాన్, మాజీ జెడ్పిటిసి సలహాదారులు పసునూరు యుగేందర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, మాజీ ఎంపిటిసి సైదులు, మాజీ సర్పంచులు రమావత్ రవి నాయక్, గడ్డం శ్రీరాములు,మాజీ ఉపసర్పంచ్లు గంధం సురేష్,యేకుల సురేష్,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యేకుల అంబేద్కర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూడావత్ మంగ్య నాయక్ బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు లాలునాయక్,బక్కులు,సురేష్,సుఖ్య, అజయ్, పాండు నాయక్,తదితర నాయకులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య



**ఆదిభట్ల,శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్9 :** నాదర్గుల్లో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే పోలీసు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం నాడు మధ్యాహ్నం సమయంలో సుమారు 1: 40 గంటల సమయంలో 40-42 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నాదర్గుల్ పరిసర ప్రాంతంలో ఒక టేకు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు 100 డయల్ వచ్చింది. హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్న వ్యక్తిని పరిశీలించగా 1 రోజు ముందు ఉరి వేసుకున్నట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడు నలుపు చెక్కుల ప్యాంటు ధరించి తన చొక్కాను తాడుగా ఉపయోగించుకున్నాడు. మృత దేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు ఆదిభట్ల ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా నిర్వహించిన సోనియా గాంధీ 78వ జయంతి వేడుకలు.



**చండూర్ డిసెంబర్ 9 (శాసనసభ న్యూస్) :** తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుక చండూరు పట్టణ & మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆనంత చంద్రశేఖర్ గౌడ్, కొరిమి ఓంకారము ఆధ్వర్యం లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో మున్సిపాలిటి వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ ,మాజి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుజా ఉద్దీన్, పల్లె వెంకన్న,కోడి గిరిబాబు, జిల్లా నాయకులు కోడి శ్రీనివాసులు,మాజి ఎంపీటీసీ ఇరిగి రాజు, కారింగ్ రామ్మూర్తి, కౌన్సిలర్ మంచుకొండ కీర్తి సంజయ్, మాజి సర్పంచ్ సాపిడి రాములు, మేకల వెంకట్,చొప్పరీ వెంకన్న,కాంగ్రెస్ పార్టి సీనియర్ నేతలు కల్లెట్లా మారయ్య, బిమనపల్లి శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

**- సమాచార హక్కు చట్టం సాధన కమిటీ.**



**హైదరాబాద్, శాసనసభ న్యూస్ నవంబర్ 9 :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ముచ్చర్ల మల్లేష్ ను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు.సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ముచ్చర్ల మల్లేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు.మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారు అని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి,రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి ఎర్రబెల్లి ప్రగతి,గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్,రాసునూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ పత్తి కేంద్రాలలో రైతులకు చుక్కలు చూపిస్తున్న దళారులు

- పత్తి రైతులను నిలువునా ముంచుతున్న దళారులు
- పత్తి విక్రయాలలో అక్రమాలు
- రైతుల పేరు...దళారుల జోరు





**చండూర్ డిసెంబర్ 9 (శాసనసభ న్యూస్) :** నల్గొండ జిల్లా వ్యాప్తంగా పత్తి విక్రయాల్లో జరిగే అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం పలు రకాల చర్యలు తీసుకుంటున్న దళారులు కొత్త పందాలు తమజోరు చూపుతున్నారు. బహిరంగ పత్తికి తక్కువ ధర ఉండడంతో గిరిజన ప్రాంతాల్లో రైతుల నుండి కొనుగోలు చేసిన పత్తిని పట్టాదారు పాసుబుక్కులు ఉన్న రైతుల పేర సిసిఐకి అన్ని సొమ్ము చేసుకుంటున్నారు. నల్లగొండ జిల్లాలోని పలు సిసిఐ కేంద్రాల్లో గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న పత్తి విక్రమాలపై శాసనసభ ప్రత్యేక కథనం.ప్రైవేటులో పత్తిని విక్రయించే రైతుల వివరాలు సర్వేలో అలాగే ఉంటాయి వాళ్ల పేరున సీసీఐకి విక్రయించే అవకాశం ఉంది. బహిరంగ పత్తికి క్వింటాలుకు రూ 6,500 నుండి రూ 7000 లోపు ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ7,521 ఉంది 12 శాతం తేమ ఉన్న పత్తిని సిసిఐ కొనుగోలు చేస్తుంది. అంతకు ఎక్కువ ఉంటే రైతులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొంతమంది దళారులు నేరుగా గ్రామాలకు వెళ్లి పత్తిని కొనుగోలు చేస్తుండగా మరి కొంతమంది ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని పత్తిని కొంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన పత్తిని రైతుల పేరున సిసిఐకి విక్రయించి లబ్ధి పొందుతున్నారు.ఉదాహరణకు రైతుల నుండి క్వింటాలుకు రూ 6,500 చెల్లించి 50 క్వింటాలు కొనుగోలు చేసిన వ్యాపారి అదే పత్తిని రైతుల పేరుతో క్వింటాలుకు ₹7,521 విక్రయిస్తున్నాడు. ఈ లెక్కన 50,000 రూపాయలు అదనంగా లాభం పొందుతున్నాడు.నిబంధనలున్నా.... జరుగుతోంది ఇలా.... సీసీఐకి పత్తిని అమ్మే రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా నెంబరు తీసుకొని రావాలి. తూకం వేసే దగ్గర సంబంధిత పట్టాదారులు ఆధార్ కార్డు నమోదు చేస్తే రైతు ఎన్ని ఎకరాలలో పత్తిని సాగు చేస్తున్నాడు అనే వివరాలు వస్తాయి. అతను తెచ్చే పత్తి తూకం ధర తేమ శాతం నమోదు తక్ పట్టి ఇస్తే సిసిఐ జిన్నింగ్ లో మరోసారి చూసుకొని కొనుగోలు చేస్తుంది. రైతుల్లో కొంతమంది ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. అలాంటి రైతుల పేరున వ్యాపారులు సీసీఐకి పత్తిని విక్రయిస్తున్నారు. రైతుల నుండి భూమిని కౌలుకు తీసుకున్నట్టుగా ధృవపత్రం తీసుకొని తమ పేరున పత్తిని నేరుగా విక్రయించి లబ్ధి పొందుతున్నారు.

### దగా పడుతున్న రైతన్న......దోపిడికి గురవుతున్న తెల్ల బంగారం

**- రైతుల కష్టం దోపిడీ దళారుల పాలవుతుంది**

రైతు కష్టం దోపిడీ దళారుల పాలవుతుంది. దిగుబడులకు మద్దతు ధర పొందడంలో రైతన్నలు దగా పడుతున్నారు. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పంట పండించిన రైతులు యేటా నష్టాలనే మూట గట్టుకుంటున్నారు. నేల తల్లిని నమ్ముకున్న రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకు పంటను అమ్ముకోవడానికి తెచ్చిన రైతులు తిరిగి వెనక్కి తీసుకపోలేక వాళ్ళు అడిగిన కాడికి, వచ్చిన ధరకు అమ్మడం తప్ప గత్యంతరం లేని దుస్థితి ఉంది. ఇదే బలహీనతను ఆసరాగా చేసుకొని రైతుల నుండి ట్రాక్టర్ లోడు 50 కేజీల నుండి 2 క్వింటాల్ వరకు కట్టింగులు చేస్తు రైతులను నిండా ముంచుతున్నారు. కొనుగోలు చేసే వ్యాపారులు మాత్రం కాలు కదపకుండా ఉన్నచోటే కోట్లు సంపాదించుకుంటున్నారు.

నల్గొండ జిల్లా చండూరు మండల పరిధిలోని మంజీత్, మునుగోడు మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలోని శివరామ(జై బిందు)తో పాటు స్థానికంగా ఉన్న సాలాసర్ బాలాజీ కాటన్ మిల్లులలో పత్తి రైతులు దోపిడికి గురౌతున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తి అమ్ముకునేందుకు వచ్చిన రైతుల 50 కేజీల నుండి 2 క్వింటాలు వరకు పత్తిని కోతలు చేస్తూ సీసీఐ నిర్వహకులు దోచుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి పత్తిని కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ రెండు కేంద్రాలలో గత కొద్ది రోజులుగా ఈ తతంగం మంతా సాగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.రోజు రోజుకు సీసీఐ నిర్వాహకుల ఆగడాలు మితిమీరి పోతుండడంతో కొంపల్లి సీసీఐ కోనుగోలు కేంద్రం వద్ద రైతులు తిరుగుబాటుకు చేస్తున్నారు. అందుకు నిదర్శనం మిల్లు వద్ద రైతులు అందరూ కలిసి ఆందోళన చేపట్టి దాదాపుగా నాలుగు గంటల పాటు కొనుగోలు కాకుండా అడ్డుకొని సీసీఐ నిర్వాహకులను నిలదీశారు. అయినప్పటికి సీసీఐ వారి తీరు మారడంలేదు. కోతలు మాత్రం యదాతదంగా జరుగుతున్నా సంబంధిత అధికారుల మొక్కు బడిన వచ్చి పరిశీలించి వారి ఇచ్చే ముడుపులకు ఆశపడి చర్యలు తీసుకోకుండా వెనుతిరిగి వెళ్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల వెళ్లిన వెంటనే సీసీఐ నిర్వహకులు యదాతదంగా కట్టింగులు చేస్తుండడంతో అధికారులకు ముడుపులు ముట్టాయని వస్తున్న ఆరోపణలు వాస్తవమేననిపిస్తున్నాయి. మా గోడు వినే వారు లేరా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

- పంపిణీ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్, తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి.





**జహీరాబాద్, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** జహీరాబాద్ పట్టణం పస్తాపూర్ లోని ఎస్వీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో జహీరాబాద్ నియోజకవర్గం 991 మంది లబ్ధిదారులకు సోమవారం నాడు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ ,సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆయా మండల అధ్యక్షులు,మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎం.పి. పిలు,మాజీ ఎం.పి.టి.సిలు,మాజీ సర్పంచ్ లు ,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసిన ఎంపి సురేష్ కుమార్ షేట్కర్, మాజీమంత్రి, జహీరాబాద్ ఇంచార్జ్ డాక్టర్ చంద్రశేఖర్.





**జహిరాబాద్, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** జహిరాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం నాడు పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ చంద్రశేఖర్ పాల్గొని కేక్ కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ అని, దశాబ్దాల ఉద్యమకళ నెరవేర్చిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పార్టీకి నష్టం జరిగినప్పటికీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టినందుకు కృషి చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, మండల అధ్యక్షులు, మక్సుద్, నరసింహ్మ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు అధికారులు సత్వరమే పరిష్కారం అందించాలి





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్,శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ శాఖ - 45,ఇతర శాఖలకు - 07,మొత్తం 52 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు,మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరిం టెండెంట్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించా రు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా నిబంధనల ప్రకారం పనుల చేయాలని అన్నారు. పెండింగు పనులను ముందుగా పరిష్కరించాలని, కింది స్థాయిలో శాఖ పని తీరును పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసి పనులు పెండింగులో లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు.

# ఘనంగా సోనియా గాంధీ వేడుకలు

- బాటసింగారం పండ్ల మార్కెట్ లో మెగా వైద్య శిబిరం ఏర్పాటు.
- వ్యవసాయ మార్కెట్ కమిటి.





**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 9 :** ఆరు దశాబ్దాల ఆకాంక్ష, నాలుగు కోట్ల ప్రజల చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్ర సాకారం చేసిన తెలంగాణ తల్లి గా శ్రీమతి సోనియా గాంధీకి తెలంగాణ రాష్ట్రం ఋణపడి ఉంటుందని,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. డిసెంబర్ 9న సోనియాగాంధి జన్మదినం సందర్భంగా మలక్ పేట యశోద హాస్పటల్స్ సహకారంతో బాటసింగారం పండ్ల మార్కెట్ లో పలు రంగాలలో అనుభవమైన వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.హమాలీలు,రైతులు,వర్తకులు,మార్కెట్ సిబ్బంది,పాలకవర్గం అందరూ వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఎంతో విలువైన పరీక్షలను పాలకవర్గం తరపున రైతులకు ఉచితంగా చేయించసారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ కృషి వల్లే తెలంగాణ రాష్ట్ర%శీ% ఏర్పడిందని వారికి మనం అంతా ఋణపడి ఉంటామని అన్నారు.అమరుల త్యాగాలను చూసి చలించినప్పటి యుపిఏ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి తెలంగాణ కలను సాకారం చేసిందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం గడిచిన సందర్భంగా రైతులకు అనేక రకాల ప్రోత్సాహకాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ సిహెచ్.బాస్కరా చారి,మార్కెట్ డైరక్టర్లు రఘుపతి రెడ్డి, అంజయ్య,గణేష్ నాయక్, వెంకట్ గుప్త, ఇబ్రహీం తో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, యశోద హాస్పిటల్ డాక్టర్లు, అరవింద్, మౌనిక, ఉమాదేవి,సూర్య, వాసు కిరణ్, శ్రీధర్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

4 SHASANA SABHA TELUGU DAILY

శాసనసభ

తెలుగు దినపత్రిక

మంగళవారం 10 డిసెంబర్ - 2024

# సోనియా బర్త్‌డేనే.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవమా?



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. మేడ్చల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేసిన అనంతరం కేటీఆర్ ప్రసంగించారు. రాజకీయ వ్యవస్థను ఒప్పించి కేసీఆర్ తన దీక్షతో తెలంగాణ ప్రకటనకు శ్రీకారం చుట్టారన్నారు.తెలంగాణ ఉన్నంత వరకు రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ నాయకత్వంలో జరిగిందనే గుర్తిస్తారన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని తెలంగాణపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను చిన్నగా చేసి చూపెట్టే ప్రయత్నంలో తెలంగాణ అస్తిత్వం మీద దాడి జరుగుతోందని విమర్శించారు. ఆర్టీసీ లోగోలో కాకతీయ కళాతోరణం మాయమైందని.. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మ మాయమైందని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు లేవని రేవంత్ రెడ్డి అర్థమైందంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇస్తే మీకు పరిపాలన రాదన్నారని.. అయితే, పదేళ్లో దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని చెప్పారు. ఇందిరాగాంధీ భారతమాత విగ్రహాన్ని హరిద్వార్‌లో ఏర్పాటు చేశారన్నారు. సమైక్య పాలకులు పగబడితే 2007లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. హంతకులే సంతాపం తెలిపినట్లు తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకున్న వాళ్లు తెలంగాణ తల్లి బీదగా ఉండాలని రూపాన్ని మార్చారంటూ కేటీఆర్ విమర్శించారు. ప్రపంచంలో ఆలిని మార్చిన వాళ్ళు ఉన్నారు కానీ.. తల్లిని మార్చిన మూరులు లేరంటూ కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ తల్లి ఆకృతిని ఎవరు మార్చమన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం మారితే తెలంగాణ తల్లి విగ్రహం మారాలా? అని రేవంత్ సర్కారును నిలదీశారు. ఉద్యమ కాలం నాటి తెలంగాణ తల్లి ఫొటోను సోషల్ మీడియాలో డీపీగా పెట్టుకుందామని బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.సోనియా జన్మదినమే.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవమా?కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ జన్మ దిన వేడుకలను తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుతారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్.. సోనియా బర్త్ డేను అధికారికంగా జరపడం కోసమా ఈ తతంగమంతా? అని ఎక్స్ వేదికగా నిలదీశారు.'మీ కాంగ్రెస్ తల్లి బర్త్ డే కోసం.. మా తెలంగాణ తల్లిని బలిచేస్తావా..!! అని కేటీఆర్ ప్రశ్నించారు. అంత అభిమానం ఉంటే మీ గాంధీ భవన్‌లో జరుపుకో.. లేదా ఢిల్లీ వెళ్లి 10 జన్‌పథ్‌లో చేసుకో.. అంతేకానీ..మీ పార్టీ జరుపుకోవాల్సిన బర్త్ డే ఫంక్షన్‌ను తెలంగాణ ప్రజలపై బలవంతంగా రుద్దుతావా ??' అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు.'ఒకప్పుడు బలిదేవత అన్నావ్.. ఇప్పుడు బర్త్ డే జరుపుతా అంటున్నావ్.. నీ నరానికి నాలుక ఉండక పోవచ్చు.. కానీ, తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీలు మార్చినంత ఈజీగా విగ్రహాల రూపురేఖలు మార్చవచ్చని అనుకోవడంనీ మూరత్వం. తెలంగాణ తల్లి దివ్య స్వరూపాన్ని కోట్లాది గుండెల నుంచి చెరిపేయొచ్చని అనుకోవడం నీ అమాయకత్వం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. జై తెలంగాణ.. జై తెలంగాణ తల్లి ట్వీట్ ముగించారు.

## ఇదేనా తెలంగాణ ఆడబిడ్డలకు సోనియా గాంధీ బర్త్ డే గిఫ్ట్?

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగినందుకు ఆడబిడ్డలను కాంగ్రెస్ పాలకులు ఖాకీలతో కొట్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఇదేనా తెలంగాణ ఆడబిడ్డలకు సోనియా గాంధీ బర్త్ డే గిఫ్ట్? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె ట్వీట్ చేశారు.'ఆశా వర్కర్లపై అమానుషం' అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగినందుకు ఆడబిడ్డలను ఖాకీలతో కొట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు.నెలకు రూ.18 వేలు ఫిక్స్ డ్ వేతనం ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ఆశా వర్కర్లను దారుణంగా కొడుతూ పోలీస్ వ్యాన్‌లలో ఎక్కించిన తీరు...అణచివేతకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉందని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ పోరాటస్పూర్తితో, బతుకమ్మ ఆడే చేతులతోనే ఈ తెలంగాణ ఆడబిడ్డలు... కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం ఖాయమని కవిత హెచ్చరించారు.

## ప్రతి ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ప్రతిష్ట ఉత్సవం

నిధులు, నీళ్లు, నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రజలు కోరుకునేది స్వేచ్ఛ అని.. తెలంగాణ అంతా ఇప్పుడు భావస్వేచ్ఛ కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించామన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పులపాలు చేసిందని.. రూ.7 లక్షల కోట్ల అప్పును బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిందని డిప్యూటీ సీఎం అన్నారు.బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులకు మేము రూ.64 వేల కోట్ల వడ్డీలు కడుతున్నామన్నారు.ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని ఆర్థికస్థితిని గాడిలో పెడుతున్నామని ఆయన చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు ఇస్తున్నామన్నారు. అనేక ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## ఢిల్లీ ఎన్నికలకు ఆప్ రెండో జాబితా- సిసోడియా సహా వీరికి సీట్లు..!

ఇవాళ ఆప్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో నరేలా నుంచి దినేష్ భరద్వాజ్, తిమర్పూర్ నుంచి సురేందర్ పాల్ సింగ్ బిట్టూ, ఆదర్శ్ నగర్ నుంచి ముకేష్ గోయల్, ముండ్కా నుంచి జస్బీర్ కరాలా, మంగోల్పురి నుంచి రాకేష్ జాతవ్ ధర్మ రక్షక్, రోహిణి నుంచి ప్రదీప్ మిట్టల్, చాందినీ చౌక్ నుంచి పునర్దీప్ సింగ్ సాహ్నీ, పటేల్ నగర్ నుంచి పర్వేష్ రతన్, మాదీపూర్ నుంచి రాఖీ బిర్లన్, జనక్ పురి నుంచి ప్రవీణ్ కుమార్, బిజ్వాసన్ నుంచి సురేందర్ భరద్వాజ్, పాలం నుంచి జోగిందర్ సోలంకికి చోటు దక్కింది.అలాగే జాంగ్ పుర నుంచి మనీష్ సిసోదియాకు, దియోలీ నుంచి ప్రేమ్ కుమార్ చౌహాన్, త్రిలోక్ పురి నుంచి అంజనా పర్చా, పత్పర్ గంజ్ నుంచి అవధ్ ఓఝా, కృష్ణానగర్ నుంచి వికాస్ బగ్గా, గాంధీ నగర్ నుంచి నవీన్ చౌదరి, షాదరా నుంచి పద్మశ్రీ జితేంద్ర సింగ్ కు, ముస్తఫా బాద్ నుంచి ఆదిల్ అహ్మద్ ఖాన్ కు చోటు దక్కింది. గతంలో ప్రకటించిన 11 మందితో కలుపుకుని ఇప్పటివరకూ 31 మంది అభ్యర్థుల్ని ఆప్ ప్రకటించినట్లయింది. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 సీట్లు ఉన్నాయి. ఈసారి కూడా ఆప్ ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించింది.

# మోహన్ బాబు వ్యాఖ్యలు బాధాకరం: ఏపీ, టీ సీఎంలకు మంచు మనోజ్ విన్నపం



శాసనసభ / హైదరాబాద్ : తాను, తన భార్య మౌనిక నుంచి ప్రాణ హాని ఉందటూ తన తండ్రి మోహన్ బాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు మంచు మనోజ్. తనకు మంచు మనోజ్, అతని భార్య మౌనిక నుంచి ప్రాణహాని ఉందంటూ మోహన్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంచు మనోజ్ స్పందించారు. తాను తన కుటుంబ ఆస్తి కోసం ఎప్పుడూ ఆశ పడలేదన్నారు.తన కుటుంబ గౌరవాన్ని కాపాడే ప్రయత్నం చేశారనని మంచు మనోజ్ చెప్పారు. తన ముందే తన కుటుంబసభ్యుల్ని కొందరు కొట్టారని తెలిపారు. తన ఇంటిలో ఉండాల్సిన సీసీ కెమెరాలు మాయమయ్యాయని అన్నారు. తన సోదరుడు విష్ణు అనుచరులే సీసీ కెమెరాల ఫుటేజీని మాయం చేశారని మంచు మనోజ్ ఆరోపించారు.తన తండ్రి మోహన్ బాబు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంచు మనోజ్ అన్నారు. మోహన్ బాబు విద్య సంస్థల్లో అక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు.గత కొంత కాలంగా తాను మోహన్ బాబు ఇంటికి దూరంగానే ఉంటున్నట్లు చెప్పారు. తనపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు మంచు మనోజ్. హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం సాయంత్రం వెళ్లిన మనోజ్..తనపై దాడి జరిగిందని తెలిపారు. జల్‌పల్లిలోని ఇంట్లోనే తనతోపాటు తన భార్యపై తండ్రి మోహన్ బాబు సమక్షంలోనే విద్యానికేతన్ స్కూల్స్ పర్యవేక్షిస్తున్న వినయ్ అనే వ్యక్తి దాడి చేశారని మనోజ్ ఫిర్యాదు చేశారు.తనపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడ్డానంటూ.. ఆస్పత్రి రిపోర్టులను కూడా పోలీసులకు అందజేశారు మంచు మనోజ్. తనకు, తన భార్యకు ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారి వివరాలను పోలీసులకు అందించినట్లు తెలిసింది. మంచు మనోజ్ ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు, మనోజ్, మౌనిక నుంచి తనకు ప్రాణహాని ఉందని మోహన్ బాబు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.తనకు రక్షణ కల్పించాలని కోరారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు మంచు కుటుంబ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

# రాష్ట్ర ఏర్పాటులో నాది క్రియాశీల పాత్ర

### 2010 జనవరి 5న అఖిలపక్ష భేటీకి కాంగ్రెస్ తరపున హాజరై రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశా: ఉత్తమ్



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంలో తనది క్రియాశీలక పాత్ర అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. డిసెంబరు 9వ తేదీకి తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని, 2009, డిసెంబరు 9వ తేదీనే అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేశారని గుర్తు చేశారు. 2010 జనవరి 5న చిదంబరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణ నుంచి కాంగ్రెస్ ప్రతినిధిగా తాను ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తెలుపుతూ వందల పేజీల నివేదికలను అందజేశానన్నారు.ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం శ్రీకృష్ణ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని తెలుపుతూ వినతి పత్రాలు సమర్పించానన్నారు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేస్తున్నామని 2013 జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటన చేసిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించుకుంటున్నందున.. ఇక నుంచి అన్ని జిల్లా కార్యాలయాల్లో ఏటా డిసెంబరు 9న తెలంగాణ చరిత్రను గుర్తు చేస్తూ అధికారికంగా వేడుకలను నిర్వహిస్తామని ఉత్తమ్ చెప్పారు. సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై శాసన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ తల్లిని అవమానించినందుకు ఈ రెండు చేద్దాం!: బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుడికి, ప్రతి ఒక్క ఉద్యమ బిడ్డకి నేను విజ్ఞప్తి చేస్తున్నాను.మనం రెండు పనులు చేద్దాం. కచ్చితంగా తెలంగాణ తల్లిని 2007లో ఏ తల్లి అయితే ఉద్యమంలో నుంచి ఉద్భవించిందో.సోషల్ మీడియా, వాట్సాప్ డీపీల్లో తెలంగాణ తల్లి బొమ్మను డీపీగా పెట్టుకుందాం.ఎవడు ఏం పీకుతడో చూద్దాం"అని సవాల్ చేశారు."మనం చేయబోయే రెండో పని.రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నచోట కాంగ్రెస్ చేసిన అపచారానికి గాను పాలాభిషేకాలు చేద్దాం" అని పిలుపునిచ్చారు.అవసరమైతే పంచామృతాభిషేకాలు చేద్దామని, జరిగిన తప్పుకు క్షమాపణలు అడుగుదామన్నారు. ఈ కాంగ్రెస్ మూరులకు చరిత్ర తెలియదు.ఈ సన్నాసులను క్షమించమని ఆ తల్లిని కోరుకుందామని వ్యాఖ్యానించారు.

## ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన చంద్రబాబు

ఏపీలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కూటమి నేడు అభ్యర్థులను ప్రకటించింది. టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సాన సతీశ్... బీజేపీ నుంచి ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు పోటీ చేస్తారని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటన విడుదల చేశారు. మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ ఉప ఎన్నికలు వచ్చాయి. డిసెంబరు 20న పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజున ఓట్ల లెక్కింపు చేపడతారు.

# సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలోనూ తెలంగాణ వచ్చేది కాదు: కోమటిరెడ్డి

సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.తెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీఎస్'ను 'టీజీ'గా మార్చాం

తెలంగాణ ఇస్తున్నట్లు కేంద్రం నుంచి తొలి ప్రకటన వచ్చింది డిసెంబర్ 9వ తేదీనే అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నట్లు చెప్పారు. కానీ తెలంగాణ వచ్చాక గత పదేళ్లు ఆంక్షలు నెరవేరలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లు ప్రజలు నిర్బంధాల మధ్య గడిపారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక హామీలను ఒక్కటొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు.

## ఇంకా 'ఉచితాలు' ఇవ్వడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

"ఉచితాలు ఇంకెంత కాలం?" అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 2013 జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం 81 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నట్లు కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. ఇది విన్న జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అంటే కేవలం పన్ను చెల్లింపుదారులే ఇక మిగిలి ఉన్నారని (ఉచిత రేషన్ తీసుకోని వారు అనే ఉద్దేశంలో) సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.కోవిడ్ సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులపై దాఖలైన పిటిషన్ మీద విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడం, సామర్థ్యాన్ని పెంచాల్సిన అవశ్యతను సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది.

# ఆనాడు అధికారికంగా ఎందుకు ప్రతిష్ఠించలేదు?

### విగ్రహాన్ని మార్చుతున్నారని ఇప్పుడు విమర్శలా?
### పదేళ్లు బీఆర్ఎస్ రాజ్యహింస పాలన సాగించింది
### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలో డిప్యూటీ సీఎం భట్టి



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చుతున్నారని విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. గత పదేళ్లు అధికారంలో ఉండి అధికారికంగా విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్ఠించలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు తలెత్తుకునే విధంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన డిసెంబర్ 9వ తేదీని సర్కారు ఏటా రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ.. 'గత పదేళ్ల పాటు ఆత్మగౌరవంతో బతకాల్సిన ప్రజలను బందీ చేసి అనుక్షణం అవమానాలకు గురి చేసి బీఆర్ఎస్ సర్కారు రాజ్యహింసతో పాలన సాగించింది. తెలంగాణను మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలపై భారం మోపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఆనాటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్రంలో భారీ బహిరంగ సభలు నిర్వహించగా, సీఎల్పీ నాయకుడిగా నేను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ పాదయాత్ర చేశా.. ప్రజలు కాంగ్రెసను ఆశీర్వదించి అధికారాన్ని కట్టబెట్టారు.తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నట్టుగా ప్రజాస్వామ్యయుత పాలన అందిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి 56 వేల మందికి ఉద్యోగాలిచ్చాం. మహిళలు ఆత్మగౌరవంతో, ఆత్మాభిమానంతో ఎదగాలని ఏటా రూ.20 వేల కోట్లు వడ్డీ లేకుండా రుణాలిస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలిచ్చి వారిని వ్యాపారవేత్తలుగా,పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దబోతున్నాం. రాష్ట్రం అప్పుల్లో ఉన్న రూ.21 వేల కోట్లతో రైతుల రుణాల మాఫీ చేశాం' అని చెప్పారు. తెలంగాణ ప్రజలు తలెత్తుకునే విధంగా మన అమ్మ, అక్క, నాయనమ్మ ప్రతిరూపంగా తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకున్నామన్నారు. అమ్మగా, ఆరాధ్య దైవంగా, పోరాటానికి స్ఫూర్తిగా, పసిడి పంటలు పండించే తల్లిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని తెలిపారు. ధరించిన ఆకుపచ్చ చీర ప్రగతిశీల భావాలు, ఉద్యమాలకు గుర్తుగా ఎరుపు రంగు, బహుజనుల పోరాట స్ఫూర్తిని గుర్తు చేసే విధంగా నీలం రంగు, రాజ్య హింస పెరిగినప్పుడు ప్రజలు తిరుగుబాటుకు గుర్తుగా పిడికిళ్లతో విగ్రహాన్ని రూపొందించామన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 వరకు వాయిదా

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేశారు. ఈరోజు సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సభలో వెల్లడించారు. ఈ విగ్రహావిష్కరణకు అందరూ రావాలంటూ సభాముఖంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు, సభ్యులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ఎదుట నిరసనకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం నమూనా అంశంపై వివరణ ఇచ్చారు. విగ్రహం నమూనా మార్పుపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాగ్వాదం జరిగింది. పలువురు సభ్యులు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారికంగా జరుపుకోవాలని సభలో నిర్ణయించారు. అనంతరం సభను 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.